# మైలురాయి

శ్రీ బి. బసవారెడ్డి

స్టేషనుముందు రిక్షాలో కాళ్లు ముడుచుకుని పడుకున్న పెంటాలు ఆరోజు తన సంపాదన ఎంతో ఆలోచించుకుంటున్నాడు. పొద్దున ఒక ఆడమనిషిని. ...టాకీసు గొందిలో విడిచివచ్చాడు. మామూలుగా పావలాకన్నా ఎక్కువ ఇవ్వరు. బేరం చేస్తుందని అర్థరూపాయి చెప్పాడు. మాట్లాడకండా ఎక్కి అర్థరూపాయి చేతిలో పెట్టింది. "చానామంచి బోణి" అనుకున్నాడు పెంటాలు. తరవాత ఓకోమిటాయన గీసి గీసి బేరమాడి మూడణాలిచ్చాడు. తరవాత లావాటి ఎదవాబిడ, ఇద్దరు పసిపిల్లలు ముగ్గురూ ఎక్కి,... టాకీసుపగ్గరే దిగారు. ససేమిరా పావలాకన్నా ఎక్కువియ్యనంది. సరే ఒప్పుకున్నాడు. ఆళ్లని లాగుతుంటే నరాలు తెగినయ్. "ఈళ్ల దగ్గర అర్థరూపాయి తీసుకున్నా దండెగలేదు" ఆ వెధవా బిడ పావలా ఇవ్వటం చాలా అన్యాయమనిపించింది పెంటాలుకు. "పిసినారి ముండ! ఎద్దంత లావుంది. మళ్ళీ దీనికి తోడు ఇద్దరు పిల్లలు" కడుపుమండి తిట్టేసేను. న్యాయం అన్యాయం ఏంటిలే? తను మాత్రం ఏం న్యాయిస్తుడు? పొద్దున ఆ అమ్మాయి దగ్గర అర్ధరూపాయి తీసుకోలా? "నువ్వియ్యాల్సింది పావలే నమ్మా! బేరమాడేతవని పావలా ఎక్కువ చెప్పాను. తీసుకోండి" అని తను తిరిగి ఇవ్వగలిగాడా?

డబ్బు గుణించుదామనుకున్న పెంటాలు ఇతిర ఆలోచనలతో లెక్క మరిచిపోయాడు. ఆలోచనల్లోంచి తెప్పిరిల్లి "పొద్దున ఆరణాలు, తరవాత పావలా, పదణాలు; మళ్లా ఒక మూడణాలు, ఒక బేడ, పావలా" ముందు ఎంచిన మొత్తాన్ని మరిచిపోయి తికమకపడ్డాడు పెంటాలు ఇలా రెండు మూడుసార్లు ప్రయత్నించినా విఫలమయింది. ఈ తంటా అంతా లేకుండా బొడ్లో డబ్బుతీసి ఎంచితే సరిగా తేల్తుంది. పొద్దుటినించి తిరిగి తిరిగి అలసటతో నడుంవాల్చిన పెంటాలు, లేచి బొడ్లో కట్టిన డబ్బు లెక్కించుకోటానికి బద్ధకించాడు. ఎదురెండ మోకాళ్లదాకా పడుతూవుంది. చుర చుర లాడుతున్న వికాళ్లు. రిక్షాతిప్పి పడుకుంటే ఎండతగలదు. కొంచెం ఓపికచేసి లేస్తే డబ్బు ఎంచుకోవచ్చు, రిక్షా ఎండకు అడ్డంగా తిప్పి పడుకోవచ్చు. ఇలా ఆలోచించి, బద్ధకాన్ని విసిరివేసి లేచి నించున్నాడు. బొడ్లో డబ్బులు విప్పి చేతులో పోసుకున్నాడు. అంతా చిల్లర. "అరేయ్ రిక్షా!" కేక వినిపించింది. "ఒస్తున్నా బాబుగారూ" అంటూ డబ్బులు మళ్లా బొడ్లో మూటకట్టి రిక్షా లాక్కెళ్లాడు దగ్గరికి. పిలిచిన పెద్దమనిషి సన్నటి గ్లాస్కో పంచ జరీఅంచుది కట్టుకున్నాడు. చేతిలో తోలు సంచీ వుంది. నేత్రాలకి కళ్లజోడు చలవదివుంది. ఎర్రగా లావుగా వున్నాడు. మనిషి నడివయసులో "ఎవరో చాలా స్తితివంతుడు" అనుకున్నాడు పెంటాలు.

"ఎక్కండి బాబుగారూ!"

"చౌకు దగ్గరకి వెళ్లాలి ఏమియ్యమంటావురా?"

"మీకు తెలవదా బాబుగారూ! ఎంతోకంత ఇద్దురుగాని ఎక్కండి బాబూ"

"వాగకుండా చెప్పరా ఎంతో" కఠినంగా ఆజ్ఞాపించాడు.

"పావలా దయ సేయించండి బాబూ. నే నేమి ఎక్కువడుగుతానా?" పెంటాలు దీనంగా అర్థించాడు.

"మూడణాలిస్తా" పక్కన సిద్ధంగా నించున్న రిక్షాల వాళ్లు అంతకే ఒప్పుకుని రాండి బాబూ నేసుకెళ్తాను అంటున్నారు. గత్యంతరం లేక పెంటాలు ఒప్పుకుని, ఆయనని రిక్షా ఎక్కించుకున్నాడు. రెండడుగులు వేసిన తరవాత ఒక కిల్లీకొట్టుముందు ఆపమన్నాడు రిక్షాని.

"కేప్స్టెన్ పెట్టె ఒకటి తీసుకురారా" అని రూపాయి చేతికిచ్చాడు. ఈ పేరు పెంటాలు చాలా సార్లు విన్నాడు, ఇలాంటి సందర్భాల్లోనే. "పెద్దమనుషులంతా ఇంతే. తాము రెండడుగు లేసే తెచ్చుకోలేరుగా మోసు"

సిగరెట్టుపెట్టి, మిగతా చిల్లర చేతికిచ్చాడు. "పదణాలు తీసుకున్నాడెవడ్రా? తొమ్మిదణాలన్నరేగా ఖరీదు. ఇంకో అర్ధణా రావాలి పట్రారా త్వరగా" అని గుర్రాన్నిలా తరిమేడు మళ్లా.

"వెధవ కాల్చిపారేసే సిగరెట్లకి వృధాగా తొమ్మిదణాలు తగలేసిన మనిషి, అర్ధనాకోసం చచ్చిపోతాడుగామోసు! అది అలావుంచు. తనతో బేరమాడి ఒక అణా పిగిల్చకపోతే పావలా ఇస్తే వీడి కొంప ఏమి కూలిపోతుందో. సిగరెట్లరేటు నిజంగా పదణాలయితే చచ్చినట్టుకొనడూ? అప్పుడయితే అర్ధనా పోయినందుకు దిగులుండదుగా మోసు" రిక్షాలాగుతూ అనుకున్నాడు పెంటాలు. మిట్టమధ్యాహ్నం బజారులో ఎక్కువ జనం లేరు. పెంటాలు ఒంటిమీది చెమట బొట్లు బొట్లుగా జారి బలమైన సిమెంటు రోడ్డు మీద పడుతోంది.

పెంటాలు అజాగ్రతగా రిక్షా పోనిస్తూ ఆలోచిస్తున్నాడు.

అణాకోసం, అర్ధనాకోసం ఇలాటి డబ్బున్నవాళ్లు పిక్కటం ఏహ్యంగా తోచింది. తన బోటివాడైతే ఆవిషయం వేరు. వేలకు వేలు ఖర్చుపెట్టే మనుషులు అర్ధనాలు, కానులు లెక్కచూసుకోవటం పెంటాలుకు బొత్తిగా నచ్చలేదు. తనకి ఈ రిక్షాలో కూర్చున్న పెద్దమనిషి కున్నంత డబ్బుంటే ఇలా చేసేవాడా? రిక్షావాడు ఎంత అడిగితే అంత పారేసేవాడు. కిల్లీకొట్లో సిగరెట్టుకొని వాడు ఎంత చిల్లరిచ్చాడో లెక్క చూసుకోకుండానే నిర్లక్ష్యంగా జేబులో పడేసుకునే వాడు.

రోజుకు రూపాయిడబ్బులు పిగల్చలేని

(37-వ పేజీ చూడండి)

కాశ్మీర్
అన్నిదగ్గులకు అమోఘమైనది
గిరిజా & కో; రాజమండ్రి

# మైలురాయి

(22 వ పేజీ తరువాయి)

తను, ఒక లక్షాధికారిని ఊహించుకుంటూ మురిసిపోవటం గుర్తురాగానే, పెంటాలు తనలో తనే నవ్వుకున్నాడు. అలా ఊహించుకున్నందుకు ఏదో తెలియని ఆనందం పెంటాలును చుట్టేసింది. తన జీవితాంతం ప్రయత్నించినా లక్షాధికారి కాలేననే సత్యం పెంటాలుకు తెలుసు. ఇయినా ఏదో తాత్కాలికోద్రేకం ఆక్షణంలో పెంటాలు మనస్సుని చెళ్లున తన్నింది. లక్షాధికారి ననుకున్నంతలో పెంటాలుకు జరిగిందేమిటి? అంత సంతోషం ఎందుకు కలగాలి? అనే ప్రశ్న వుండదు. అవరసనచూస్తే, ఎక్కడో దూరదేశంలో వున్న కుర్రాడు ప్రేయసిని స్మరించి, పాత అనుభూతులు గుర్తు తెచ్చుకుని సంతోషిస్తాడు. ఆపిల్ల తన చేతుల మధ్య వున్నట్టే పొంగిపోతాడు. అతనికేమిటి ఒరుగుతుంది? పెంటాలు ఊహాసముద్రంలో మునకలు వేస్తూ పరుగు పెట్టున్నాడు. ఒళ్ళంతా హుషారు పాకింది. ఎంతకాలంనించో కదలలేకుండా, జీవచ్ఛవంలా పడివుండి, పెంటాలు లాంటివాళ్లు లక్షల సంఖ్యలో రోజూ తనమీదపోతూవుంటే, ఏమీ చెయ్యలేక, ఏమీ అనలేక, తెల్లగా పాలిపోయిన మొహంతో నిర్జీవంగా చూస్తూ వున్న సిమెంటురోడ్డు-దానిమీద పెంటాలు దౌడుతీస్తున్నాడు ప్రేటుతిన్న గుర్రంలా.

* * *

రిక్షా ఓనరు వాటాపోను, తనకి మిగిలిన రూపాయి పావలా చిల్లర లెక్కపెట్టుకుంటూ పెంటాలు రోడ్డు ఎక్కాడు. తన గుడిసె దిక్కుగా రోడ్డుమీదపడి అడుగులు వేసి ఠక్కున ఆగిపోయాడు. ఇంటి విషయాలన్నీ గుర్తువచ్చినయ్. జబ్బుతో వున్న మూడు సంవత్సరాల పసిపిల్లకు మందు ఇప్పించాలని రెండురోజులనించి పెళ్లాం పోరుచేస్తుంది. "ఎక్కడన్నా అయిదు రూపాయిలు పట్రా రా" అని అహోరాత్రాలు కూడు నీళ్లు లేకుండా ఏడుస్తూ తనువెళ్లినప్పుడల్లా నానా మాటలు అంటూ వుంది. కూడు పెట్టమని అడిగితే "బిడ్డకిట్టా వుంటే నీకొక్కరవ్వయినా దిగులు లేదెరా! నీకడుపు నువ్వు చూసుకుంటూ బొచ్చె పగలకొట్ట కోటానికి ఒచ్చావంట్రా? నువ్వు కటికోడివి. నీగుండె కటికిరాయి. నియ్యంటి ముదనష్టపాడికి పుట్టాడీ బంగారం" అని భావురుమని ఏడ్చేది. "నీ కాళ్లు పట్టుకుంటూరా! ఒక్క అయిదు రూపాయలు తెచ్చి నా బిడ్డని బతికించరా!" అని బతిమలాడేది కాళ్లపడి. ఒక క్షణం పాటు ఆ నరకాన్ని కళ్లముందు చిత్రించుకుంటూ నిశ్చేతనుడయ్యాడు పెంటాలు. ఒక్క నిట్టూర్పు విడిచి అనిర్ణీతంగా బయలు దేరాడు అడుగులు వేస్తూ, ఎక్కడికో? ఏమో?

ధర్మాసుపత్రికి తీసికెళ్తే, డాక్టరు మందు చీటిరాసిచ్చాడు. నాలుగున్నర అవుతుందట. ఈ సంగతి రెండు రోజులక్రితమే చెప్పింది పెంటాలు పెళ్లాం. రెండు రోజులుగా పెంటాలు ప్రయత్నం చేశాడు. మొదటిరోజు పెంటాలు రూపాయిన్నర సంపాయించాడు. ఉదయంనించీ పశువులా రిక్షాలాగిన పెంటాలుకి సాయంకాలానికి విపరీతమైన ఆకలి వేసింది. పొద్దున తాగిన గంజి మెతుకులే ఇంతవరకు ఆధారం. కడుపు నిండా తినకపోయినా కొద్దిగా అయినా ఏమీ తినకపోతే బతకలేడు. పదణాలు పెట్టి బజారుతిండి కొనుక్కున్నాడు. అణాబీడీలు. పోతే పదమూడణాలు మిగిలినయ్. అయిదు రూపాయిలు తెమ్మంటే ఈ ముష్టి పదమూడణాలు తీసికెళ్తే పెళ్లాం మరీ తిట్టిపోస్తుంది. ఇంకా కోపం వస్తది. పెంటాలుకా అయిదు రూపాయిలు ఎంతో పెద్ద మొత్తంగాను, పదమూడణాలంటే, దానికన్నా ఎన్నో వందలరెట్లు తక్కువగాను కనిపించింది. ఇవాళ్టికి ఎలాగయినా పెళ్లాన్ని బతిమలాడుకుని, రేపు తప్పక సంపాయించి తెచ్చిద్దామనుకున్నాడు. పదణాలు కర్చుచేసి తిన్నా, కడుపులో ఏమూలకీ రాలేదు. ఇంకా ఆకలి వేస్తూనే వుంది. అయిదునిమిషాలు ఆలోచించాడు పెంటాలు. "ఎటుతిరిగి ఈ పదమూడణాలు ఎందుకు పనికిరావు. ఈ డబ్బుతో కూడా ఏదైనా తింటే కడుపయినా నిండుతుంది. తరవాత చూచుకోవచ్చు. ఒకవేళ నా అదృష్టం బాగుండి రేపు అయిదు రూపాయల బాడిగ దొరుకుతుందేమో" అనుకుని ఆ మిగిలిన డబ్బుకూడా తినేశాడు. రెండో రోజు కూడా ఇలాగే జరిగింది. కాని ఇంకా పెంటాలుకు రేపటిమీద ఆశపోలేదు. ఈ ఆశ లేకపోతే నేడు మృగాలకన్నా హీనంగా రోజులు వెళ్లబుచ్చుతున్న నూటికి ఎనభైమంది, జీవితాలు ఒదిలేసే వాళ్లు. జీవితం మార్పులు లేకుండా ఈ రోజు లాగానే ఎల్లకాలం వుంటుందని ఎవరూ అనుకోరు. అలా అనుకుని జీవించలేరు. అలా జీవిస్తున్న వాళ్లు చాలా మంది వున్నారు గాని, వారంతా రేపు చస్తామనగా ఇవాల్టివరకూ ఉజ్వలమైన భవిష్యత్తుకోసం ఎదురుచూస్తూ మరణించినవాళ్లే; కాని వారి ఆశలు అడియాసలే. వారు ఊహించుకున్న ఆశాపూరితమైన "రేపు" లన్నీ కూడా, దుఃఖ భాజనమైన 'నిన్న'లకన్నా ఎక్కువైనవి, ఏవీ కావు.

పెంటాలుని పెద్దసమస్య ఎదుర్కొంది. గుడిసెకి వెళ్లటమా. మానుకోటమా? పిల్లాడి బాధలు మూలుగులు వినలేక, పెళ్లాం తిట్లు పడలేక ఈరెండు రోజుల్లోనే పెంటాలుకు తల వాచింది. ఇంటికి వెళ్ళటమంటే ఏ సముద్రంలోనో దూకటం లావుందతనికి. గుడిసెకి వెళ్లలేడు. గుడిసెకి వెళ్లేదేమిటిలే! అని నిశ్చితంగా ఎక్కడికో ఒక చోటికి వెళ్లనూ లేడు. కానీ ఒక విషయం మాత్రం పెంటాలుని బాధించటము లేదు. "ఇంటి దగ్గర బిడ్డ ఏమై పోతాడో?" అనే దిగులు అతనికి లేదు. పెంటాలు అయిదు రూపాయిలు సంపాయించాలని ప్రయత్నించాడంటే అది కొడుకుని బ్రతికించుకోవాలని ప్రేమచేత కాదు; పెళ్లాం పోరు సహించలేక, దాని మాటలు పడలేక, ఎలా అయినా ఆ నరకంనించి బయట పడాలని అభిప్రాయంతో మాత్రమే. అసలు మొదటినించీ కూడా అతనికి పుత్ర ప్రేమ ఏకోశాన




లేదు. "ఎందుకని?" ఈ ప్రశ్న అతను రెండుమూడు సార్లు వేసుకున్నాడు. "చాలామంది తండ్రులు, కొడుకులకోసం పడి చస్తుంటారే. మరి నేను కొడుకంటే ఎందుకు పడి చావను?" సమాధానం దొరకలేదు పెంటాలుకి. పెళ్ళి కాకముందు ఒకే ఒక పెద్ద కోరికవుండేది: ఏ నాడైనా సరే ఒక రోజున కడుపునిండా, ఇక ఒద్దు అనే వరకు మంచికూరలతో మంచిభోజనం తినాలి అని. అది ఈరోజువరకు తీరని కోరిక. పెళ్ళి అయిన తరవాత ఒక కొత్త రకం ఆనందం దొరికింది పెంటాలుకి. పొద్దు కూకగానే గబగబ రిక్షా అవతల పారేసి గుడిసెకి చేరేవాడు ఏవో కలలు కంటూ. ఒండినకూడు చెరిసగం పంచుకునేవారు. కడుపునిండేది కాదు. అయినా పెళ్ళాందగ్గర కొంత సుఖం దొరుకుతుంది గదా అని ఊరుకునేవాడు. కొన్నాళ్ళకి పెళ్ళానికి గర్భిణీ వచ్చింది. ఆరోనెల. పెంటాలు పొద్దు కూకినతరవాత మామూలుగా సాంగత్యానికి పెళ్ళాం పక్కన చేరేవాడు. ఆమె "ఒళ్ళు నెప్పిగావుంది" అనో, "కాళ్లు తీసుకు పోతున్నయ్" అనో తప్పుకునేది. పెంటాలు పెళ్ళాం చాలా బలహీనమైన మనిషి కావటం చేత ఆరోనెలకే చాలావరకు నీరసించి పోయింది. పెంటాలు మరీ బలవంతం చేస్తే "బిడ్డకి ఒత్తిడి తగులిద్దు ఒద్దు" అని కఠినంగా అనేసేది. అతను బాధ పడేవాడు. కాని ఏమి చెయ్యలేక ఆకోరిక బలవంతాన అణచుకునేవాడు. పుట్టబోయే కొడుకంటే అసహ్యం వేసిందతనికి. ఇలా వుండగా అకస్మాత్తుగా ఒక ఆలోచన తట్టిందతనికి. "తన పెళ్ళానికి కొడుకు పుడ్తాడు. పాలుతాగి పెద్దోడౌతాడు. అన్నంతినే వయసు ఒస్తుంది' అప్పుడు పెళ్ళానికీ తనకీ ఇద్దరికే చాలని అన్నంలో మూడో వాటాదారుడౌతాడు." ఈ ఆలోచనతో పెంటాలు మరీ నిరుత్సాహపడ్డాడు. కొడుకు పెరగకుండా వుండడు. ఒక్కో ఏడు పెరిగే కొలది ఇంకా ఎక్కువ అన్నం తింటాడు. తను రోజు రోజు అన్నం తగ్గించి తినటం అలవాటు చేసుకోవాలని ఊహించిన పెంటాలుకు తన కొడుకు ఒక పెద్ద యమదూతలా కనిపించేవాడు. అందువల్ల కొడుకు చచ్చిపోయినా అతనికి పెద్ద చింత లేదు. చచ్చేవాడిని చావనియ్యకుండా తన పెళ్ళాం మందులిప్పించాలని అనుకోవటంవల్ల పెంటాలుకు పెళ్ళాంమీద బ్రహ్మాండమైన కోపం వచ్చింది. "అయిదురూపాయలంటే మాటలాఏంటి? వాళ్లు ఎలాగో చస్తారు. నేను మాత్రం ఆ నరకంలోకి వెళ్లను." అని నిశ్చయించుకున్నాడు పెంటాలు.

పెంటాలు పరధ్యాసతో ఆలోచనలతో నడుస్తున్నాడు. చాలా మంది జనంగుంపులుగా ఎదురయ్యారు. అతను ఊహించాడు. "సినిమాహాలు దగ్గరలోనేవుంది. మొదటి ఆటకి వెళ్ళి జనం బయటికి ఒస్తున్నారు." అని. రక రకాల మనుషులు– ఆడ వాళ్ళని, మగవాళ్ళని నిర్నిమిత్తంగా చూస్తూ హాలు వద్దకి చేరాడు. తనుకూడా సినిమాకు వెళ్లాలనుకున్నాడు. అనుకోవటం, టిక్కెటు కొనటం సినిమాలో కూర్చోవటం ఒకదాని వెంట ఒకటి జరిగి పోయినయ్. విశ్రాంతి సమయంవరకుకథలోనిమగ్నమై చూచాడు సినిమా. లైట్లు వెలిగినయ్. బల్ల మీద ఒక పక్క ఒడ్డిగిల్లి ఏదో ఆలోచిస్తూ, బీడీ వెలిగించాడు.

పెంటాలు సినిమాలు చూడటం సాగించి చాలా కాలమైంది. మొదట ఊరికే బొమ్మలు చూచేవాడు. తరవాత కథని గురించి ఆలోచించటం మొదలెట్టాడు. అతనికి కొన్నాళ్ళుగా ఒక కోరిక కలిగింది. సినిమాలో మనుషులకి ఎవరికైనా తన పోలికలున్నాయేమోనని వెతికేవాడు. సినిమాలోలాగు, తను ఏమైనా చెయ్యటానికి వీలుందా? అని ఆలోచించేవాడు. సినిమాలో అనేక రకాలుగా అదృష్టం కలిసిఒస్తుంది; అలాగే దురదృష్టం.

సినిమాలో నాయకుడు అనేక కష్టాలు పడతాడు. చివరికి అన్నీ గాలికి మబ్బులు విడిపోయినట్టు విడిపోతవి. ఎన్నాళ్ళనించో వెతుకుతున్న ప్రియురాలు హఠాత్తుగా ఏరోడ్డుమీదనో కనిపిస్తుంది. అతడు బీదవాడైనా పరవాలేదు. ఏ ధనవంతుడి కూతురో ప్రేమించేస్తుంది. ఏ స్నేహితుడో చచ్చిపోతూ తన ఆస్తిఅంతా రాసిచ్చిపోతాడు. ఒకవేళ కథానాయకుడు ధనవంతుడైతే, బీదపిల్లను పెళ్లిచేసుకోటానికి తండ్రి అంగీకరించకపోతే ఇంట్లోంచి లేచిపోయి మెడ్రాసు, బొంబాయి, కలకత్తా ఇలాటి పెద్దపట్టణం చేరతాడు. అక్కడ వీడి పాత స్నేహితుడు ఒక ఫ్యాక్టరీ పెట్టుకు కూర్చుంటాడు. ఇతను తెలవకుండానే సరిగా అదే ఫ్యాక్టరీలోకి ఉద్యోగంకోసం పోతాడు. పాతస్నేహితుడు కావిలించుకుని ఇతన్ని ఆ ఫ్యాక్టరీకి మేనేజరుగా చేస్తాడు. ఇంటి దగ్గర ప్రేయసి ప్రియావియోగాన్ని భరించలేక ఆత్మహత్యకు నదిలో దూకుతుంది. దారిలో ఎవడో వలవేసి చేపలుపడ్తుంటాడు సరిగా ఆవలలోనే చిక్కుతుంది. హాస్పిటలులో చేరుస్తారు. స్పృహవచ్చి కళ్లు తెరిచేసరికి ప్రియుడు ఎదురుగా నించుని వుంటాడు. ఇద్దరూ కావిలించుకుంటారు. సుఖాంతమౌతుంది. ఇలాంటివి నమ్మదగ్గ విషయాలేనా? అని పెంటాలుకు అనుమానం వేసేది.

ఒక్కో సినిమాలో యువతీ యువకులు ప్రేమించుకుంటారు. ఇద్దరిలో ఎవరోఒకరి తండ్రి ఈ పెళ్లిని అంగీకరించడు. ఇక్కడ పిల్ల తండ్రి ఒప్పుకోడనుకుందాం. ఇంకోడికిచ్చి పెళ్లి చేస్తాడు. పెళ్లి కానిచ్చి తరవాత పాయిజన్ తాగి చచ్చిపోతుంది యువతి. ఈ వార్త తెలిసి యువకుడు కూడా కొండ మీది నుంచి దూకుతాడు. చచ్చిపోతాడు. ఇలా ప్రేమించిన ఒకరి కోసం ఒకరు ఎందుకు చచ్చి పోతారో? దానివల్లవారికి సంక్రమించే లాభం ఏమిటో పెంటాలు బుర్రకి అందేది కాదు. వాళ్లు చచ్చిపోయే ఘట్టాల్లో పెంటాలు ఒళ్లు గర పొడిచేది. మనసునిండా విచారం అలముకునేది.

సినిమా జరుగుతోంది. హాలుమీదసన్నగా చినుకులు పడుతున్న శబ్దం, పెంటాలుకు సినిమా మీద విసుగెత్తింది. సాంతం అవకముందే హాలు బయటికి ఒచ్చాడు. "ఎక్కడికి వెళ్లాలి?" అని ప్రశ్న వచ్చింది. ఒక క్షణం ఆలోచించాడు. ఒకసారి గుడిసెకి వెళ్లి పెళ్ళాం ఎట్టావుందో, కొడుకు చచ్చిపోయాడో ఇంకా బతికి వున్నాడో చూసి రావాలనిపించింది. బయలుదేరాడు. వర్షంతో తడిసిన రోడ్డు మీద కాళ్లు జారుతున్నయ్. ఇంకా చినుకులు పడుతూనే వున్నయ్. అంతా చీకటి మయంగా వుంది. గుడిసె పది గజాలు వుందనగా ఆగి నిలుచున్నాడు పెంటాలు. గుడిసెలోకి వెళ్లాలంటే భయం వేసింది. పెళ్లాంకంట పడాలంటే గుండెని ఎవరో అదిమిపట్టినట్టుగా భయమేసింది. ఎంత ప్రయత్నించినా వెళ్లలేకపోయాడు. అలాగే నిర్జీవంగా నిలిచిపోయాడు. "పోనీ తిరిగి వెళ్లనా?" అని ఆలోచించాడు. పెళ్లానికి కనపడకుండా గుడిసె వెనకనించి చాటుగా, కొడుకు ఎలా వున్నది చూసిపోవాలని, నిశ్చయానికి వచ్చాడు.

ఆరిపోటానికి సిద్ధంగా వున్న గుడ్డిదీపం వెలుతురు గుడిసెవెనక సందులలోంచి కనిపించింది. మెల్లిగా అడుగులో అడుగువేసుకుంటూ, కంతద్వారా తొంగిచూచాడు గుడిసెలోకి. ముస్సుందుగా పెళ్లాం మొహంలోకి చూశాడు, మసకగా ప్రసరిస్తున్న కాంతిలో జుట్టు విరజోసుకుని వుంది. కళ్లు ఎర్రగా జ్యోతుల్లా మండుతున్నయ్. ఆరి పోయిన కన్నీటి చారలు చెంపలమీద ఇంకా అలాగే వున్నాయి. పెంటాలు కళ్లకి ఒక మహాకాళిలా అనిపించింది అతని

భార్య. వణికిపోయాడు. ఆమె మొహంలో దుఃఖవుందో, కోపంవుందో పెంటాలు గుర్తించలేక పోయాడు. ఆమె ముందు చినిగిపోయిన చాపమీద కొడుకు అరమోడ్పు కన్నులతో పడివున్నాడు. పొట్ట ఎగరవేస్తూ గురక పెడుతున్నాడు. ఆ అరమోడ్పు కళ్లు బాధాపూరితంగా, అతి దైన్యం వెళ్లబోస్తూ, తల్లి మొహంలోకి చూస్తున్నవి. పెంటాలు బరువుగా నిట్టూర్చాడు. వాడి స్థితి చూసి జాలి వేసింది. తను చేసిన పని ఎంత నిర్దాక్షిణ్యమైనదో పెంటాలుకు అప్పుడు తెలిసివచ్చింది. తన చర్యకి పశ్చాత్తపించాడు. "తను సంపాదించిన మూడు రోజుల డబ్బు ఖర్చు చెయ్యకపోతే మందుకు సరిపోయేవి. అప్పుడు ఇంతబాధ పడేవాడు కాదుగా" అని చింతించాడు. మరుక్షణంలోనే తాను ఎవరిని గురించి జాలిపడుతున్నాడో, అతడు తన జీవితానికి కంటకప్రాయమైన తన కొడుకు అని తెలియగానే పెంటాలు హృదయంలో ద్రవించిన జాలిని రాక్షసత్వం నాకివేసింది. అప్పటికి పెంటాలు ఒంటిమీది బట్టలు వర్షానికి తడిసిపోయినయ్. ఇంకా చినుకులు పడుతూనే వున్నయ్. తిరిగి ఊళ్లోకి వెళ్లిపోదామని నిశ్చయించాడు. ఒక అడుగు వెనక్కి వేసేసరికి కాలికిందపడిన తాటాకు గలగల మోగింది. ఈ శబ్దానికి తన పెళ్లాం బయటికి వస్తుందేమోనని భయపడి పరుగెత్త మొదలెట్టాడు. రెండు ఫర్లాంగుల దూరం ఆగకుండా పరుగెత్తి అప్పుడు వెనక్కి తిరిగి చూశాడు. తను భయపడటమేగాని వెనక ఎవరూ వస్తున్న అలికిడి వినిపించలేదు. మెల్లిగా నడక ప్రారంభించాడు. పరుగెత్తిన అలసట ఇంకా తీరలేదు. దారి చీకటిగా వుంది. వున్నట్టుండి ధనధనమని శబ్దంచేసుకుంటూ ఎక్కడో పడింది పిడుగు. ఈధ్వనికి పెంటాలు గుండె గతుక్కుమంది. పోతూ పోతూ హఠాత్తుగా పల్లపు గుంటలోకి పడి లేచిన బండికలె అయింది అతని మనస్థితి. హృదయాన్ని చేత్తో తట్టి "ఫరవాలేదు" అని ధైర్యం చెప్పాడు. దారికూడా సరిగా కనపడటంలేదు. వర్షతీవ్రత మరీ హెచ్చింది. కుండపోతగా కుమ్మరిస్తుంది. తడిసి ముద్దయిపోయాడు పెంటాలు. "ఇప్పుడు ఎక్కడికి వెళ్లినా లాభంలేదు. ఈ వేళప్పుడు సత్రాలలోకి ఎవర్నీ రానియ్యరు" అనుకుంటూనే రాయితగిలి బోర్లపడ్డాడు. రోడ్డుకి బలంగా గుద్దుకుంది మొహం. లేవబోయి దెబ్బతగిలిన కాలు నిలుపుకోలేక మళ్లా పడిపోయాడు. తన కాలికి తగిలింది ఏదో పెద్దగానే వుంది వస్తువు. చూట్టూ చేతికందినవరకు తడిమి చూశాడు. అది ఒక పెద్దరాయిలా వుంది. ఆ చీకట్లో అంతకన్నా ఎక్కువ తెలియలేదు. మొహమంతా దోక్కుపోయి మంట పెడుతూ వుంది. బలాన్నంతా కూడదీసుకుని, అతిప్రయత్నంతో రెండడుగులు వేసి ఒక షాపు ముందు అరుగుమీద వెల్లకిలా పడిపోయాడు. వర్షం కురుస్తూనే వుంది. చలికి పెంటాలు నరాలు ఎక్కడివక్కడ బిగిసిపోయినవి. తన దీనావస్థకి అమితమైన దుఃఖంవచ్చింది. "ఎంత గతిలేని బ్రతుకు" అనిర్దిష్టంగా తనలో తను గొణిగాడు పెంటాలు. "ఇప్పుడు పెళ్ళాం తన దగ్గరవుంటే, ఎలాగైనా బ్రతికించుకోకుండా వదిలి పెట్టుందా? ఈ విషయం దానికెలా తెలుస్తుందిప్పుడు?" అనుకున్నాడు. ఈ వర్షానికి తన పెళ్లాం, కొడుకు ఎక్కడ అవస్థపడుతున్నారో? తనలాగే పిల్లవాడు అమితబాధపడుతూ వుంటాడు! "అయ్యో పాపం!" పెంటాలు నోటినుంచి స్పష్టంగా వెలువడినయ్ మాటలు. గుడిసె వెనకనించి చాటుగా చూసినప్పుడు పిల్లవాడి గురక, పెంటాలు గుండెలు కదిలించింది. బాధంటే ఏమిటో ప్రత్యక్షంగా అనుభవిస్తున్న పెంటాలు అప్పుడు గ్రహించాడు, తన కొడుకు బాధని. ఇప్పుడా పసిబిడ్డ తన కన్నా ఎక్కువబాధ పడుతూవుంటాడు. తను ఎంత దుర్మార్గుడు! అంత చీకటిలో కూడా పెంటాలుకు తన క్రౌర్యం, వికృతరూపం ధరించి, కోరలు చాచుతూ భయంకరంగా నత్యటం కనిపించింది. తెల్లవారగానే గుడిసెకి వెళ్లి తన కొడుకుని గుండెకి హత్తుకోవాలి. "ఇంతజబ్బులో వున్న పసివాడు ఈ వానలో తడిసి ఇంకా బతుకుతాడా?" అని అనుమానం వేసింది పెంటాలుకు. వెక్కి వెక్కి ఏడ్చాడు "భగవంతుడా! నా కొడుకుని బ్రతికించు" అని ప్రార్థించాడు. ఇకనించి బిడ్డకు ఎంత చిన్న జబ్బు వచ్చినా, తను పస్తుండి అయినా సరే మందు తెప్పించాలి. పెంటాలుకు, ఇన్నాళ్ళుగా అసహ్యించుకొంటున్న కొడుకుమీద ఉప్పెనలా పొంగింది ప్రేమ. ఇన్నాళ్లుగా మానవత్వాన్ని అణిచిపెడుతూ వచ్చిన ఏదో విషహస్తం తొలిగిపోయింది.

ప్రపంచాన్ని తేజోమయంచేస్తూ బ్రహ్మాండమైన మెరుపు ప్రకాశించి అంతరించింది. తను పడటానికి కారణమైన వస్తువేదో ఇప్పుడు స్పష్టంగా కనిపించింది. అది ఒక మైలురాయి. భూమిలోంచి పెళ్లగిలి ఒరిగిపడివుంది. ఆ మైలురాయి తనకాలు గుద్దుకున్నప్పుడు పడిపోయి వుంటుంది. దీనికి సాక్ష్యం తను అనుభవిస్తున్న బాధ. ఇంతకన్నా వేరే ఏమీ అవసరంలేదు. బాధ జాస్తిఅవుతోంది. పెంటాలుకు అకస్మాత్తుగా ఒక ఆలోచన బుర్రలో మెదిలింది. "నేను నా కొడుకుని పెట్టిన బాధకి ప్రతీకారంగా భగవంతుడు నాకీ శిక్ష విధించాడా? నా పాపమే నన్నీ స్థితికి తీసుకొచ్చి, దిక్కుమాలిన చావుకు గురిచెయ్యబోతోందా?"

"ప్రపంచంలో తిండికి కరువాచి, వారాల తరబడి పస్తులతో, అలమటిస్తూ అనేకమంది చస్తున్నారు—వీళ్లంతా పాపాత్ములేనా? అయితే పాపాత్ములమీద కత్తిగట్టి వారిని యమయాతనలతో హింసించి చంపే దేవుడు మాత్రం ఏమి ఘనుడు?" దేవుడిమీద రోత పుట్టింది పెంటాలుకు.

గాలి ఒక్క విసురు విసిరింది. షాపు ముందు పెద్దపెద్ద అక్షరాలతో తగిలించి ఉన్న ఇనపబోర్డు, తీగ తెగి పెంటాలు మీద పడింది. "అబ్బ!" అని అరిచాడు.

పెంటాలు ఆలోచించటం మానేశాడు. శరీరంలో ఆలోచించేశక్తి అయిపోయింది. ఖాళీదేహం విశ్రాంతిగా గచ్చు అరుగుమీద పడివుంది.

ఇంకా వర్షం కురుస్తూనే వుంది! ఆకాశం మెరుస్తూనే వుంది!! పిడుగులు ఉరుస్తూనే వున్నయ్!!!

నా కొక అనుమానం. "పత్రికల్లో, వితే ఖరులు పెంటాలుని గురించి ఏమి రాస్తారా?" అని. ★

భర్త ఇంటికిరాగానే భార్య చెప్పింది:

"మాశారా, ఇవ్వాళేం జరిగిందో? మనగోడ గడియారం కాస్తా కిందపడింది. ఒక సెకండు ముందుపడివుంటే నా తలపగిలేది."

"ఆ వెధవ గడియారం ఎప్పుడూ 'స్లో' గానే వుంటుందిలే."